చదువులమ్మ చెట్టు నీడలో...



మంచిర్యాలఅర్బన్: క్రిషి ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లతో పూర్వ విద్యార్థులు



శ్రీరాంపూర్: శారదా శిశుమందిర్ విద్యార్థులు



వేమనపల్లిలో..

నాడు చదువులమ్మ కోవెలలో సందడి చేసిన రోజులు మళ్లీ గుండె గదిలో జ్ఞాపకమై కదలాడాయి. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరోసారి చూసి మురిసిపోయారు. 'అరేయ్.. ఒరేయ్..' అనే పలకరింపులతో చదువులమ్మ ప్రాంగణాలు పులకరించిపోయాయి. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు అలరించాయి. కోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1983- 84, మంచిర్యాల క్రిషి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ 1992- 94, వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006- 07, శ్రీరాంపూర్‌లోని శారదా శిశుమందిర్ పాఠశాలలో 2006-07, కొత్తరోడ్‌లోని శ్రీలక్ష్మీ శిశుమందిర్ పాఠశాలలో 2003- 04, మందమర్రిలోని శ్రీరాఘవేంద్ర పాఠశాలలో 2002- 03లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆయా పాఠశాలల ఆవరణలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను ఆహ్వానించి ఆత్మీయంగా సత్కరించారు. ఆటలు, పాటలు, డ్యాన్స్‌లతో హోరెత్తించారు.

– శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/వేమనపల్లి/మంచిర్యాలఅర్బన్/కోటపల్లి



కోటపల్లిలో...



శ్రీలక్ష్మీ శిశుమందిర్ విద్యార్థులు



మందమర్రిలో శ్రీరాఘవేంద్ర హైస్కూల్ విద్యార్థులు

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చాంపియన్ షిప్ గెలుచుకున్న విద్యార్థులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ శార్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొని ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో నాలుగు వందల మంది విద్యార్థులు పాల్గొనగా శార్వాణి పాఠశాల విద్యార్థులు ఏడుగురు పాల్గొని మూడు బంగారు, నాలుగు వెండి పతకాలు సాధించి చాంపియన్‌గా నిలిచారు. జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా ఓవరాల్ చాంపియన్ గెలుచుకున్న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన జీపీవో పరీక్ష

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నిర్వహించిన గ్రామపాలన అధికారుల రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించారు. 155మంది అభ్యర్థులకు గాను 132మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నట్లు, జవాబు పత్రాలు పకడ్బందీగా తరలించినట్లు తెలిపారు.

మునీర్‌కు నివాళి

శ్రీరాంపూర్: అనారోగ్య కారణాలతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్‌కు పలువురు నివాళులర్పించారు. మంచిర్యాలలోని ఆయన మృతదేహాన్ని ఆదివారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ సందర్శించి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌లు మునీర్‌కు నివాళులర్పించారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు కాంపెల్లి సమ్మయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, సింగరేణి సకల జనుల సమ్మె నాటి జేఏసీ కన్వీనర్ గోషిక మల్లేశ్ నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న గ్రామ యువకులు

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామపంచాయతీ పరిధిలోని కుర్మగూడం గ్రామానికి చెందిన నిరుపేద అయిన అంజ గట్టయ్య రెండు కిడ్నీలు పాడై ఇటీవల మృతి చెందాడు. ఇంటి పెద్ద అనారోగ్యంతో అకాల మృతి చెందడంతో కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూడగా, గ్రామ యువకులు, పెద్దలు కలిసి విరాళాలు సేకరించి రూ.1.15లక్షల నగదును మృతుడి భార్య లక్ష్మికి ఆదివారం అందజేశారు.

అభివృద్ధి పాలాభిషేకాలకే పరిమితం కాదు

- 50ఏళ్లకు సరిపడా పనులు చేస్తున్నాం
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: అభివృద్ధి అంటే కేవలం జీవోలను తెచ్చి, పాలాభిషేకాలు, కొబ్బరికాయలు కొట్టడం కాదని, కార్యరూపం దాల్చి పూర్తి చేస్తేనే అభివృద్ధి అవుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తన 20ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ హబ్‌లో రూ.200కోట్లు లబ్ధిపొందుతూ, భూములు ఇచ్చిన వారికి మాత్రం రూ.13.50లక్షల పరిహారం ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు సత్యదూరమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు భూములను సేకరించి, వాటికి పరిహారంగా డబ్బులతో పాటు, లేఔట్ చేసి 241 ప్లాట్లతో ఇంటి స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మించడంతో పాటు, 152మందికి ఉద్యోగం కూడా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం సేకరించే భూమి అసైన్డ్ భూమని, ఆ భూమి కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వచ్చే నెల 6వ తేదీ తరువాత తనతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎల్లంపల్లి భూనిర్వాసితులకు ఏ విధంగా పరిహారం అందించారో చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునాథ్‌కు ఈ ప్రాంతంపై అవగాహన లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉందని, ఇక్కడి బీజేపీ నాయకుడు కేంద్రంతో మాట్లాడి, ఐబీ నుంచి బసంత్‌నగర్‌కు స్కైవేను తెప్పించేలా చూడాలని, తాను ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులతో మాట్లాడతానన్నారు. స్కైవేకు రాష్ట్రం నుంచి 10శాతం నిధులు కేటాయించేలా చూస్తానని, కేంద్రం నుంచి 90శాతం నిధులు ఇప్పిస్తారా అని అన్నారు. వరుసగా రెండో ఏడాది వేసవికాలంలో తాగునీటికి సమస్య లేకుండా చేశానని, తాను చేపడుతున్న అభివృద్ధి పనులు రెండు నుంచి మూడేళ్లలోపు పూర్తవుతాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చానని, 50ఏళ్లకు సరిపడే అభివృద్ధి పనులను తాను చేపడుతుంటే, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి, భయంతోనే అసత్యపు మాటలతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు పబ్బం గడుపుతున్నారన్నారు. ఎవరెన్ని మాటలన్నా విద్య, వైద్యంను ప్రజలకు అందించేందుకు పనిచేస్తానని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

మంచిర్యాలటౌన్: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం సాయంత్రం ఓరియంట్ సిమెంట్ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ ప్రెసిడెంట్ అభ్యర్థి సత్యపాల్‌రావుతో కలిసి కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం హామీ ఇచ్చారు.

పద్మశాలి విద్యార్థులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

బెల్లంపల్లి: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులకు బెల్లంపల్లిలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం పురస్కారాలు ప్రదానం చేశారు. పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ తరఫున విద్యార్థులకు నగదు పురస్కారం ట్రస్ట్ నిర్వాహకులు గడ్డం జగన్నాథం, సిలివేరు నర్సింగం, చిదిరాల భావనరుషి, రాజలింగు, వెంకటస్వామి అందజేశారు. శాలువతో సత్కరించారు. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన దివ్యాంగులకు ప్రతీనెల రూ.500 పెన్షన్ అందించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు 11 మందికి పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు బండారి సరయు, వేముల మానస భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పద్మశాలి సేవాసంఘం, మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు సతీశ్, బంక రమేశ్, మంచికట్ల రాజు, మహిళా మండలి అధ్యక్షురాలు సామల శోభారాణి, రాజ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు శ్రీలత, కృష్ణ, ఉమాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలింపు



ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలిస్తూ...

కోటపల్లి: మండలంలోని వెంచపల్లి గ్రామంలో అక్రమంగా మొరం తరలింపు గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. మండలకేంద్రానికి 25కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉండటం, ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ రారు అనే ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన నాయకుడు తన ఇంటి నిర్మాణానికి గ్రామానికి సమీపంలోని ప్రభుత్వ భూమిలో నీల్వాయి ప్రాజెక్టు కాలువకు ఎడమ వైపున మట్టిని తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. రాత్రిపూట యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా, ఫలితం లేకుండా పోతుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి మొరం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై డీటీ నవీన్‌కుమార్‌ను వివరణ అడుగ్గా వెంచపల్లి గ్రామంలో మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజా పోరాటాలతోనే పార్టీ బలోపేతం



పుర వీధుల్లో ర్యాలీ చేస్తున్న సీపీఐ శ్రేణులు

బెల్లంపల్లి: ప్రజా పోరాటాలతో పార్టీని బలోపేతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. బెల్లంపల్లి పట్టణ కార్యాలయంలో 21వ పట్టణ మహాసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్, బజారు ఏరియా మీదుగా ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సర్దార్ భగత్‌సింగ్, దివంగత నేత గుండా మల్లేశ్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. పార్టీ కార్యాలయం వద్ద తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు గుండా సరోజ ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకర్ మాట్లాడారు. పార్టీ పునాదులు ప్రజా పోరాటాలపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. ప్రజాసమస్యలపై జనాన్ని సమీకరించి నిరంతరం పోరాటాలు చేయాలని సూచించారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని తెలిపారు. సమరశీల ఉద్యమాలకు సిద్ధంగా ఉండి ప్రజాభిమానం చూరగొనాలని పేర్కొన్నారు. సీపీఐతోపాటు ప్రజాసంఘాల నిర్మాణాలు పటిష్టం చేయాలన్నారు. శాఖలు, మండల, పట్టణ కమిటీలు బలంగా ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం.వెంకటస్వామి, బి.పూర్ణిమ, సీనియర్ నాయకులు చిప్పనర్సయ్య, ఆడెపు రాజమొగిలి, బొంతల లక్ష్మీనారాయణ, దాగం మల్లేశ్, రేగుంట చంద్రశేఖర్, సోని, బొంకూరి రాంచందర్ పాల్గొన్నారు.

డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాలి

మందమర్రిరూరల్: సహారా ఇండియాలో డబ్బులు డిపాజిట్ చేసి కాలపరిమితి ముగిసినప్పటికీ సంస్థ నుంచి ఎలాంటి చెల్లింపులు జరగలేదని, వెంటనే గడువు తీరిన డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాలని సహారా ఇండియాలోని డిపాజిటర్లు డిమాండ్ చేశారు. ఆదివారం సహారా ఇండియా బాధితుల సంఘం నాయకులు చిలుక సంజీవ్ ఆధ్వర్యంలో పలువురు సమావేశమయ్యారు. డిపాజిటర్ల సూచనల మేరకు పలు తీర్మానాలు చేసినట్లు సంజీవ్ తెలిపారు. సమావేశంలో గజెల్లి వెంకటయ్య, డి.రాజమౌళి, కొమురయ్య, గంగారాం తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో రెండు నెలల క్రితం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు మధుకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

యూరియా నీళ్లు తాగి రెండు ఎద్దులు మృతి



యూరియా నీళ్లు తాగి మృతి చెందిన ఎద్దు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బొగుడగూడంకు చెందిన రైతు చేసిన ఏమరుపాటుకు రెండు కాడెడ్లు మృతిచెందాయి. మరికొన్ని పశువుల మందకు ప్రాణహాని తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది ప్రాణహిత ముంపునీటిలో తన చేనులోని యూరియా బస్తాలు తడిసిపోగా, వర్షాకాలంలో వాటిని రైతు ఇంటికి తెచ్చుకున్నాడు. గడ్డలు కట్టి ఉండటంతో యూరియా బస్తాలను ఎక్కడ పారవేయాలో తెలియక గ్రామ సమీపంలోని ఎంచనీటి కుంటలో పడేశాడు. మేతకోసం ప్రాణహిత నది వైపు వెళ్లిన తెలుగ లింగయ్య, గొండె శంకర్ ఎడ్లు యూరియా నీటితో ఉన్న కుంటలో నీళ్లు తాగాయి. అరగంట వ్యవధిలో యూరియా మందు ప్రభావానికి అక్కడే పడి మృతి చెందాయి. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి వెళ్లి రోడ్డు వైపుగా వస్తున్న పశువులు, గేదెల మందను పక్కకు వెళ్లగొట్టారు. అవి కూడా యూరియా నీటిని తాగితే భారీ సంఖ్యలో పశువులు మృతి చెందేవని గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాంచంద్‌కు సమాచారం ఇచ్చి డోజర్ ట్రాక్టర్‌తో కుంటలో మట్టి నింపి, యూరియా నీళ్లు లేకుండా చదును చేయించారు. యూరియా బస్తాలు వేసి ఎడ్ల మృతికి కారణమైన ఆ రైతు నుంచి గ్రామ పెద్దలు అక్కడే పంచాయతీ పెట్టి కొంతలో కొంత నష్టపరిహారంగా రూ.35వేలు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు.

వాడబలిజల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: వాడ బలిజల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాడబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బోడెంకి మహేశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎర్రోళ్ల మల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో ఆదివారం వాడబలిజ సేవా సంఘం 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాడ బలిజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పానెం కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడెంకి కుమార్, నాయకులు గగ్గూరి తిరుపతి, బొల్లే శ్రీనివాస్, బుద్ధి దేవేందర్, చిక్కాల చంద్రయ్య ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి



గేదెల కళేబరాలు

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట శివారులోని పొలాల్లో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందాయి. ఆదివారం తెల్లవారుజామున రోజువారీగా మేతకు గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్లాయి. శనివారం రాత్రి వీచిన గాలివానకు గుండ్ల సోమారానికి వెళ్లే 11 కేవీ విద్యుత్ తీగలు కిందపడిపోయాయి. అటుగా వెళ్లిన గేదెలు తీగలకు తగలి అక్కడికక్కడే మృతిచెందాయి. జక్కుల రాజన్నకు చెందిన రెండు గేదెలు, నాగన్నకు చెందిన ఒక గేదె మృతి చెందాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

చెన్నూర్‌లో ఎద్దు...

చెన్నూర్‌రూరల్: మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన ముకుం రాజేందర్ అనే రైతుకు చెందిన ఎద్దు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఏజీఎల్ డీటీఆర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తున్న ఎద్దుకు ఎర్త్ తీగలు తాకి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు. కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కొట్టె శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పేకాటాడుతున్న ఐదుగురి అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం రాజీవ్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండీ నాసర్ ఇంట్లో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. నాసర్‌తో పాటు ఎండీ.బేగ్, ఎండీ జమిల్‌పాష, ఎస్కే హైమద్, రాళ్లపేటకు చెందిన పులి సీతరామాంజనేయులును అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.33,940 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

నియామకం

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) బెల్లంపల్లి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ సీపీఐ కార్యాలయంలో 21వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఆడేపు రాజమౌళి వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా బొల్లం అంబేడ్కర్ తిలక్‌ను, కోశాధికారిగా మంతెన రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 41 మందితో పట్టణ కౌన్సిల్‌ను ఎంపిక చేశారు.

కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అహల్యాబాయ్ హోల్కర్ జయంతి వేడుకల్లో భాగంగా బీజేపీ హాజీపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నర్సింగాపూర్ గ్రామంలోని చేనేత కార్మిక పరిశ్రమను సందర్శించి చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. వెంటనే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు స్వామి, సెంట్రల్ ఫిలీం బోర్డు సలహా కమిటీ సభ్యుడు మోటపలుకుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

భీమారం: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రాం ఆదివారం టెలివిజన్‌లో ప్రదర్శించారు. ఆ ప్రోగ్రాంను మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో బీజేపీ మండల ఇన్‌చార్జి జాడి తిరుపతి, మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, జిల్లా నాయకులు మాడెం శ్రీనివాస్ వీక్షించారు.